ప్రజాశక్తి
శనివారం 4 జనవరి 2025
5
శ్రీకాకుళం

పశుసంవర్ధక శాఖ జెడిగా రాజగోపాల్

శ్రీకాకుళం అర్బన్ : పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ కంచరాన రాజగోపాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా బొబ్బిలి పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జెడిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఆర్.మురళీధర్ గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో రాజగోపాల్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో జిల్లాలో పశువైద్యాధికారిగా, ఏడిగా పలుచోట్ల పనిచేశారు.

ఈ పండుగకు ఇంతే..!

- ప్రతినెలా అందిస్తున్న సరుకులకే కోత
- సంక్రాంతి కానుక ఊరింపే
- కందిపప్పు నాణ్యంగా లేకపోవడంతో పలుచోట్ల నిలిపివేత

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పండగ నెల వచ్చింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సంక్రాంతి కానుక అందుతుందని లబ్ధిదారులు ఆశించారు. ఎన్నికల సమయంతో పాటు రెండు నెలల కిందట కానుక అందిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడంతో, ఈ ఏడాది సరుకుల కిట్లు పంపిణీ ఉంటుందని అంతా భావించారు. జనవరి సరుకుల్లో అవి లేకపోవడంతో అంతా నిరాశకు లోనయ్యారు. కానుక లేకున్నా ప్రభుత్వం కనీసం పూర్తిస్థాయిలో రేషన్ సరుకులైనా పంపిణీ చేస్తుందని ఆశించినా, అవీ లేకపోవడంతో ఈ పండగకు ఇంతే అని అంతా నిట్టూరుస్తున్నారు.

జిల్లాలో 1603 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,71,803 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 19,77,698 మంది లబ్ధిదారులు సభ్యులుగా ఉన్నారు. జిల్లాలోని 422 మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండియు) వాహనాల ద్వారా సరుకులను అందిస్తున్నారు. ఈ నెలలో బియ్యంతో పాటు కందిపప్పు, పామాయిల్, పంచదార తదితర సరుకులు అందిస్తారని అంతా భావించినా అందరికీ సరుకులు అందిన పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలలు గోధుమ పిండి పంపిణీ చేసినా పండగ నెలలో దాన్నీ ఆపేసింది. దీంతో ఎప్పటిమాదిరిగానే కార్డులో ఎంతమంది సభ్యులు ఉంటే అన్ని కేజీల బియ్యం అందిస్తున్నారు. బియ్యంతో పాటు ప్రతి కార్డుకూ అరకేజీ చొప్పున పంచదార పంపిణీ చేపడుతున్నారు.

నాణ్యంగా లేక ఆపేసిన కందిపప్పు పంపిణీ

రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు ఎప్పుడు ఇస్తారో, ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వైసిపి ప్రభుత్వ హయాంలో 2023 జూన్ నుంచి డిసెంబరు వరకు కందిపప్పు సరఫరా చేయలేదు. గతేడాది పండగకు మాత్రం జనవరిలో పంపిణీ చేశారు. తర్వాత అక్కడ్నుంచి రేషన్‌లో కందిపప్పు ఇవ్వడమే మానేశారు. మార్చి నుంచి జూన్ వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగడంతో కందిపప్పు కొనుగోళ్లు, పంపిణీ అంశాలను ప్రభుత్వం పక్కనపెట్టింది. జూన్‌లో కొత్తగా కొలువుదీరిన టిడిపి కూటమి ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా రేషన్‌లో అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించినా అది కార్యాచరణకు నోచుకోలేదు. చివరకు గతేడాది డిసెంబరులో కందిపప్పు పంపిణీ చేశారు. కందిపప్పు ప్రతి నెలా వస్తుందని అంతా భావించారు. ఈ నెలలో కొన్ని మండలాలకు మాత్రమే కందిపప్పు పంపిణీ చేస్తున్నారు. జిల్లాకు వచ్చిన కందిపప్పు నాణ్యంగా లేకపోవడంతో వాటిని వెనక్కి పంపినట్లు తెలిసింది. శ్రీకాకుళం, లావేరు, కంచిలి, జి.సిగడాం తదితర మండలాలకు సరఫరా చేసిన పప్పు నాణ్యంగా లేక పోవడంతో, లబ్ధిదారులకు ఇవ్వకుండా ఆపేశారు. సుమారు 42 క్వింటాళ్ల వరకు వెనక్కి పంపినట్లు అధికారులు చెప్తున్నారు.

సంక్రాంతి కానుకపై ఊరింపే

రేషన్ దుకాణాల ద్వారా సంక్రాంతి కానుక అందిస్తామంటూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడంతో ఈనెల సరుకులు అందుతాయని అంతా ఆశించారు. రేషన్ సరుకులు తర్వాత వాటిని ఇస్తుందనే ఆశతో లబ్ధిదారులు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారు. 2014-19 వరకు టిడిపి ప్రభుత్వం ప్రతి ఏడాది రంజాన్, క్రిస్మస్, సంక్రాంతి పండగలకు కానుకను అందించేది. పేదలకు బియ్యంతో పాటు కందిపప్పు, అరకేజీ బెల్లం, కేజీ పంచదార, కేజీ గోధుమపిండి, లీటరు ఆయిల్ ప్యాకెట్, నెయ్యి వంటి సరుకులను పంపిణీ చేసేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని ఆపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఆ సరుకులు అందుతాయని అంతా ఆశలు పెట్టుకున్నారు. ఈనెల రేషన్‌లో కేవలం బియ్యం, పంచదార, కొంతమందికి కందిపప్పు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకుంది.

శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

36 జిఒను అమలు చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు
- నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ నంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఇంజినీరింగ్ విభాగం జిల్లా కన్వీనర్ రాణా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులందరికీ పారిశుధ్య కార్మికులతో సమానంగా బేసిక్ వేతనం రూ.21 వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం నగరపాలక సంస్థ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు వర్కర్స్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ యాక్టు -1970 ప్రకారం శాశ్వత స్వభావం కలిగి ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలన్నారు. పనిలో అవసరమైన పనిముట్లు, కిట్లు నగరపాలక సంస్థ సకాలంలో అందించాలని కోరారు. వాహనాల మరమ్మతుల భారాన్ని కార్మికులపై మోపకుండా మున్సిపల్ శాఖ చేపట్టాలన్నారు. చట్టబద్ధమైన వారాంతపు, క్యాజువల్, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు.

పారిశుధ్య కార్మికులతో పాటు ఇంజినీరింగ్ కార్మికులకు రెండు జతల యూనిఫామ్, కుట్టుఛార్జీ, చెప్పులు, సబ్బులు నూనెలు, టవల్స్ ఏటా ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు అదనపు పనులు కేటాయించినప్పుడు తప్పనిసరిగా టిఎ, డిఎలు చెల్లించాలన్నారు. సిటీ బస్ సర్వీసులున్న ప్రతి పట్టణంలో పారిశుధ్యం, ఇంజినీరింగ్ కార్మికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. గత సమ్మెకాల ఒప్పందాల్లో భాగమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ పదేళ్ల సర్వీసు ఉన్న వారికి రూ.75 వేలు, పదేళ్ల పైబడి సర్వీసు ఉన్న వారికి ఏడాదికి రూ.రెండు వేలు అదనంగా ఇవ్వాలని, ప్రమాద మృతులకు రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షల పరిహారాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుల దహన సంస్కారాలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన ఖాజీపేట పంప్ హౌస్ శ్లాబ్ తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలన్నారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి ప్రమాదం సంభవించినా ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. పార్కుల్లో పనిచేస్తున్న మహిళలకు మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని కోరారు. నగర విస్తరణలో భాగంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు పి.త్రినాథరావు, పి.మణికంఠ, ఆర్.గిరిజాశంకర్, పి.శ్రీకాంత్, ఆర్.రమేష్‌బాబు, పి.సోమేష్, పి.శాంతి, జి.లక్ష్మి, జయమ్మ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకుంటే.. 10 నుంచి సమ్మె

ఇచ్ఛాపురం : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించుకుంటే ఈనెల పదో తేదీ నుంచి సమ్మె తప్పదని సిఐటియు మండల కన్వీనర్ రమేష్‌కుమార్ పట్నాయక్ హెచ్చరించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలపై నేటికీ జిఒలు జారీ చేయలేదన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాధవరావు, శ్రీకాంత్, హరికృష్ణ, చిరంజీవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపల్ కమిషనర్ రమేష్‌కి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పార్టీలకతీతంగా జిల్లా ప్రగతి

- అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి
- జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

పార్టీలకతీతంగా జిల్లాను ప్రగతిపథంలో తీసుకువెళ్లాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 2, 4, 7, ఒకటో స్థాయీ సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఒకే తాటిపై నడుస్తూ జిల్లా అభివృద్ధిపథంలో పయనించేలా సమిష్టిగా పనిచేయాలన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఖరీఫ్ రైతులు పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలన్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం, ముందస్తు కోతల వల్ల ధాన్యంతో తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొన్నిచోట్ల మిల్లర్లు తిరస్కరిస్తున్నారని పౌరసరఫరాల సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు నష్టపోకుండా చూడాలని సూచించారు. ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.15 కోట్లు చెల్లింపులు పూర్తి చేసినట్లు ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్ వెల్లడించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలో కట్టడాలు ఉన్నాయని, వాటికి పరిహారం చెల్లించిన తర్వాత మిగిలిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ రోడ్డు పనులను ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులో వేగం పెంచి పూర్తి చేయగలిగామన్నారు. మిగిలిన పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ పరిధిలో నిర్మాణంలో ఉన్న రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లావేరు జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు అధ్యక్షతన మూడో స్థాయీ సంఘ సమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్, మత్స్య, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల పనితీరుపై సమీక్షించారు. జంపు కన్నతల్లి అధ్యక్షతన ఐదో స్థాయీ సంఘంలో డిఆర్‌డిఎపై చర్చ సాగింది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, లక్‌పతి దీదీ, పిఎం, ఇపిజిపి, నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధి, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, బిగ్ ఇంపెక్ట్, పింఛన్ల పంపిణీ తదితర వివరాలు వివరించారు. ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారం, అంగన్వాడీ భవన నిర్మాణాలు, మనబడి నాడు-నేడు, గృహహింస, దిశ వన్ స్టాప్ సెంటర్ సంబంధించిన పనులపై వివరించారు. సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, జెడ్‌పిటిసి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మ్యాపును పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

రథసప్తమి వేడుకలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అరసవల్లి రథసప్తమి వేడుకల్లో యాత్రికులకు అసౌకర్యం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. రథసప్తమి వేడుకల బందోబస్తు ఏర్పాట్లను ఎమ్మెల్యే గొండు శంకర్, పోలీస్, ఆలయ అధికారులు, అర్చకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆలయ భౌగోళిక మ్యాపు, ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడెక్కడ ఎంతమంది బందోబస్తు అవసరమనే విషయాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ప్రధాన సింహద్వారం, దర్శన మార్గాలు, బారికేడ్ల ఏర్పాటు, క్యూ లైన్లు, ప్రవేశద్వారం, మండపం, ఇంద్రపుష్కరిణి, ఉచిత దర్శనం మార్గం, ప్రసాదం కౌంటర్లు, కేశఖండన తదితర ప్రదేశాలను పర్యవేక్షించారు. దర్శనానికి వచ్చే యాత్రికులకు క్యూలైన్ మేనేజ్‌మెంట్, ప్రవేశమార్గాల వద్ద పోలీసు బందోబస్తు, భద్రత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాలు కేటాయించి ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉచిత దర్శనం మార్గంలో యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున క్యూ లైన్ మేనేజ్‌మెంట్ క్రమపద్ధతిలో ఉండాలన్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వరరావు, సిహెచ్.వివేకానంద, అరసవల్లి ఇఒ వై.భద్రాజీ, సిఐలు పైడిపునాయుడు, ఈశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి లోగో రూపకల్పనకు ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర పండగగా ప్రకటించిన అరసవల్లి రథసప్తమి వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ వేడుకలకు ప్రత్యేక లోగో రూపకల్పనకు ఔత్సాహికులను ఆహ్వానిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ప్రకటించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వేడుకల నిర్వహణకు సంబంధించి విస్తృతంగా చర్చించారు. వేడుకలకు ముందు జిల్లావ్యాప్తంగా సూర్యనమస్కారాలు నిర్వహించే కార్యక్రమం, శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయి క్రీడలు, నగర వీధుల్లో శోభాయాత్ర వంటి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. లక్షలాది యాత్రికులు తరలివచ్చే ఈ వేడుకలకు పార్కింగ్, లేజర్ షో, నమూనా ఆలయాల ప్రదర్శన, సిసి కెమెరాలు, మంచినీటి సౌకర్యం, ప్రసాదాల కౌంటర్లు, రవాణా, వసతి సౌకర్యాలు వంటి అన్ని అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మరుసటి వారం నిర్వహించే సమీక్షలో ఫ్రంట్ లైన్ అధికారులందరూ వారి ప్రణాళికలతో హాజరుకావాలని సూచించారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలి

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

విద్యార్థులు విద్యను అభ్యసించడమే కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని జ్యోతిరావు పూలే కస్తూరిబా పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు తెలుగు పద్యాలపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాల భవనం సరిపోక ఇబ్బందిగా ఉందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఏడాదిలో అన్ని సదుపాయాలతో కూడిన నూతన భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తానని హామీనిచ్చారు. పాఠశాల మరుగుదొడ్లను ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మన ఇంటి పరిసరాలను ఇలాగే అపరిశుభ్రంగా ఉంచుతామా అని ప్రశ్నించారు. మరుగుదొడ్ల తలుపులను వెంటనే బాగు చేయాలని ఆదేశించారు. వారానికోసారి పారిశుధ్య సిబ్బందిని జ్యోతిరావు పూలే పాఠశాలకు పంపించి పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. మోడల్ స్కూళ్లు, కస్తూరిబా వంటి పాఠశాలల్లో కూరగాయలు సరఫరా చేయడానికి వెండర్లు ఉండగా జ్యోతిరావు పూలే పాఠశాలకు కొత్తగా కూరగాయల కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేయడమేమిటని సిబ్బందిని ప్రశ్నించారు. మార్కెట్ ధర కంటే 10 నుండి 30 శాతం ధరలను తగ్గించి సరకులను పాఠశాలకు సరఫరా చేస్తున్నాడని ఒక్కోసారి ధరలు బహిరంగ మార్కెట్లో పెరిగినప్పుడు సరకుల పరిమాణాన్ని తగ్గించి అందజేస్తాడని సిబ్బంది చెప్పారు. ఇలా అయితే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎలా అందుతుందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. నవంబరు, డిసెంబరు ఫైళ్లను, కాంట్రాక్టర్ కోట్ చేసిన వివరాలను పంపించాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలని, లేకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం అక్కడ్నుంచి ఒకటో వార్డు పరిధిలోని కస్తూరిబా పాఠశాలను సందర్శించారు. పాఠశాల రహదారి అధ్వానంగా ఉందని, నూతన రహదారి నిర్మించాలని కెజిబివి పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష కోరారు. పాలకొండ, శ్రీకాకుళం వైపు వెళ్లే ఫైవ్ స్టాప్ బస్సులను కస్తూరిబా పాఠశాల వద్ద నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో కొర్లకోట ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, జ్యోతిరావు పూలే ప్రిన్సిపాల్ జి.వాసుదేవరావు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న రవికుమార్

శాస్త్ర, సాంకేతికరంగాలపై ఆసక్తి పెరగాలి

జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు విద్యతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెరగాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాలల జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తమ ఆలోచనలకు అనుగుణంగా పొందూరు కెజిబివి విద్యార్థులు తయారు చేసిన గ్యాస్ లీకేజీ డిటెక్షన్, పురుషోత్తపురం మోడల్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన మైక్రో ఆల్గే టెక్నాలజీ, ఒప్పంగి జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన సర్వైలెన్స్ కారు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ప్రాజెక్టులను పరిశీలించిన ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ ప్రదర్శనలో 916 ప్రాజెక్టులను విద్యార్థులు ఆవిష్కరించారు. వీటిలో ఉత్తమమైన ఆరు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి వివరించారు. ఎమ్మెల్యే గొండు శంకర్, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ ప్రాజెక్టులను సందర్శించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డిఇఒ తిరుమల చైతన్య, సమగ్ర శిక్ష ఎపిసి ఎస్.శశిభూషణరావు, డిప్యూటీ డిఇఒలు ఆర్.విజయ కుమారి, విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో ఆవిష్కరణలను పరిశీలిస్తున్న జెసి, డిఇఒ

దావా సమన్లు

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE AT GUNTUR
O.S.NO. 211/2014

Between:
Mudigonda Srinivasa Rao ... Plaintiff
And
M/s Viswas Real Estate & Infrastructure India Ltd.,, Rep. by its Mg. Director K.Satyanarayana and others ..Defendants
To,
D-53: Davala Dhana Lakshmi W/o Rama Krishna, R/o Door No.2-166, Syama Sundrapuram Village, Tekkali Mandal, Srikakulam District.

పై నెంబరు దావాలో ప్రతివాదికి సమన్లు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన ఉదహరించిన ప్రతివాది ది.09-01-2025 న ఉ॥గం॥10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది: 09-01-2025

యడ్లపల్లి కోటేశ్వరరావు,
వాది తరపు అడ్వకేట్, 2/18, బ్రాడీపేట,
గుంటూరు సెల్: 9397107449

IN THE HONOURABLE COURT OF THE M-A-C-T-CUM- 2ND DISTRICT JUDGE AT SRIKAKULAM (A.P).
M.V.O.P. 182/2023.

Between:
Banki Ramarao. ...Petitioner.
And:
1) Jargulla Raveendra Naidu and another. ...Respondents.
To,

R1) Jarugulla Raveendra Naidu, S/o Venkata Ramana Murthy, @ Venkata Ramana Murthy Naidu, Door No: 4-126, Naidu Complex, Etcherla village and Mandalam, Srikakulam District.
R2) Jarugulla Swathi, W/o Venkata Ramana Murthy, Rest-do.

NOTICE

Please take this notice in the above matter that the above matter is posted to **28-01-2025** for your appearance. You are here by directed to appear before the above court **at 10-30 A.M.** in person or thorough advocate with out fail. Otherwise the matter will be decided in your absence.

// By court order. //

M. KALI PRASAD
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9160549308

మహారాజశ్రీ శ్రీకాకుళం అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ ఎక్సైజ్ మేజిస్ట్రేట్ శ్రీకాకుళం కోర్టు
OS.168/2022

Between:
పేడాడ సాయికిరణ్ .....వాది
And:
పేడాడ నాగరాజు మరియు ఇతరులు ....ప్రతివాదులు

నోటీసు

To,
D-31: సూరు విజయలక్ష్మి, W/o హరిచంద్రరావు, D/o తామాడ రామచంద్రరావు, డోర్ నెంబర్ 1-37-46, భారత్ నగర్ కాలనీ, బలగ, శ్రీకాకుళం పట్టణం, మరియు జిల్లా.
D-33: పామిని అప్పన్న, S/o లేటు సూర్యనారాయణ, గౌతమ్ నగర్, రాయగడ, ఒరిస్సా రాష్ట్రం.

మీపై వాది పై కోర్టులో Partition దావా వేచి ఉన్నారు. మీకు సమన్లు జారీ నిమిత్తం పలుమార్లు బెటా కట్టిననూ మీరు ఉద్దేశపూర్వకంగా తప్పించుకొనుచున్నారు. అందువలన పై దావా మీ హాజరు నిమిత్తం **తేదీ 10-01-2025న ఉదయం 10:30 గంటలకు** పైకోర్టులో మీరు స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని హాజరు కాగలరు. లేని పక్షంలో మీ పరోక్షమున పై దావా తీర్మానించబడినని ఇందుమూలంగా తెలియ జేయడమైనది

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //
కంచరాన నాగభూషణరావు
న్యాయవాది, శ్రీకాకుళం.

అభ్యర్థితో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రశాంతంగా దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా జిల్లాకు సంబంధించి మహిళ కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన మహిళ అభ్యర్థులకు ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో శుక్రవారం దేహ దారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. 317 మంది అభ్యర్థులు క్వాలిఫైడ్ అయ్యారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రెవెన్యూ సంఘం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ ఉద్యోగుల సంఘం, ఎపి జెఎసి అమరావతి వార్షిక కేలండర్‌ను శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి ఆయనకు వార్షిక డైరీని అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయిప్రత్యూష, జిల్లా అమరావతి జెఎసి చైర్మన్ కె.శ్రీరాములు, మహిళా విభాగం చైర్మన్ కె.ప్రవల్లిక ప్రియ, రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్ రాజు, ట్రెజరర్ మురళీధర్ నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎస్.దిలీప్ చక్రవర్తి, ఎ.సింహాచలం, ఎస్.వి.రమణ జనరల్ సెక్రటరీ, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు డి.సోనికిరణ్, పలాస రెవెన్యూ డివిజన్ యూనిట్ అధ్యక్షులు కె.రామారావు, బి.శ్రీనివాసరావు, జి.వెంకట రమణ, రామలింగం, గ్రేడ్-2 విఆర్‌ఒల సంఘం సభ్యులు స్పందన తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి వాణి

వాడివేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి- టెక్కలిరూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆట్ల సరోజినమ్మ అధ్యక్షతన శుక్రవారం వాడివేడిగా మండల సమావేశం జరిగింది. జెడ్‌పిటిసి దువ్వాడ వాణి మాట్లాడుతూ అక్కువరం సమీపంలో జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలు పంపిణీలో అక్రమాలు జరిగాయని, వాటిని వెలుగులోకి తేవాలని తహశీల్దార్ దిలీప్ చక్రవర్తికి సూచించారు. తమ ప్రభుత్వంలో వివక్షత లేకుండా పాలన చేశామని నేడు కూడా వివక్షత లేకుండా సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. కొంతమంది సర్పంచ్‌లు పనులు నిర్మాణం చేపట్టారని వాటికి బిల్లులు చెల్లించకపోవడంతో అధికారుల నిర్లక్ష్యమని సర్పంచ్‌లు నిలదీశారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ లక్ష్మీబాయి, ఎంఇఒ దల్లి తులసీరెడ్డి, చిన్నవాడు, మండల ఇంజనీర్ ఎస్.ఎల్.నాయుడు, లేబర్ ఇన్‌స్పెక్టర్ రాధాకుమారి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కళాశాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

ఏర్పాట్లు పక్కాగా చేయాలి

మెళియాపుట్టి: కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి లోపాలు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక ఎస్‌డిఆర్‌ఆర్‌ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైతం ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లకు సంబంధించి అధ్యాపకులతో మాట్లాడారు. విద్యార్థులు భోజనాలు చేయనున్న వరండాను పరిశీలించారు. విద్యార్థుల కొరకు కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తూనే, ఇక్కడ స్టూడెంట్స్ ఎంతమంది ఉన్నారు, తదితర వాటి వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులతో పాటు అధ్యాపకుల సైతం భోజనాలు చేసినట్లయితే మంచి మెసేజ్ చేరుతుందన్నారు. కళాశాలకు సంబంధించి గ్రౌండ్ బాగోలేదని సరిచేయాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈయనతో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, కళాశాల ప్రిన్సిపాల్ పైడి పద్మావతి, డిప్యూటీ తహశీల్దార్ రాము, మండల విద్యాశాఖధికారి మల్లారెడ్డి పద్మనాభరావు, జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు ఇ. మాధవరావు, సంజయ్ కుమార్ నాయక్, ఎస్.భాస్కరరావు, మాధురి దేవి, ఎన్.సంతోష్ కుమార్, పి.రోజా, వై.కృష్ణకుమారి, ఎస్.నలినికుమారి, విఆర్‌ఒ సోమేశ్వరరావు, కార్యదర్శి అప్పారావు, ప్రసాద్, కళాశాల సిబ్బంది తదితరులున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పొందూరు: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలం రాపాకలో నెహ్రూ యువ కేంద్రం శ్రీకాకుళం ఆధ్వర్యంలో శుక్రవారం క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. శుక్రవారం జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల్ తెలిపారు. ఈ స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా ఎస్.ఎం.పురం బ్లాక్ పరిధిలో కబడ్డీ (పురుషులు), వాలీబాల్ (పురుషులు), బ్యాడ్మింటన్ (పురుషులు-మహిళలు), రన్నింగ్ (పురుషులు, మహిళల విభాగం)లో నిర్వహించారు. విజేతలకు ఎస్ఐ చేతులమీదుగా క్రీడా సామగ్రి కిట్, ప్రశంసాపత్రం, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, మండల టిడిపి నాయకులు ఖండాపు శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షులు కొంచాడ సన్యాసిరావు, కార్యదర్శి పప్పల శ్రీనివాసరావు, నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్ ఎల్.హరిచందన, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గెలుపొందిన బహుమతులతో క్రీడాకారులు

సావిత్రిబాయి పూలే స్ఫూర్తి

మెళియాపుట్టి : పూలమాల వేస్తున్న గిరిజన సంఘం నాయకులు

లావేరు : చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కంచిలి : పూలే విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- కవిటి

ఆధునిక విద్యతోనే స్త్రీకి విముక్తి లభిస్తుందని సావిత్రిబాయి పూలే భావించారని ఎంఇఒలు ధనంజయ్ మజ్జి, చిట్టిబాబు అన్నారు. సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఎంఆర్‌సి వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ సావిత్రిభాయి పూలే తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి 1848లో పూణేలో మొదటి బాలికల పాఠశాల నెలకొల్పి స్త్రీ విద్యకు పునాది వేసిన మహనీయురాలని కొనియాడారు. దేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పేరుగాంచిందన్నారు. అలాగే ముత్యాలపేట ప్రాథమిక పాఠశాల వద్ద గ్రామానికి చెందిన హేమారావు దంపతుల ఆర్థిక సాయంతో సావిత్రి బాయి పులే విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు వరలక్ష్మి, బి.ఉషారాణి, బి. భారతీదేవి, లక్ష్మీబాయి, బి.శ్రీమణి, బి.తేజస్వి, ఎం. గోపి, కె రంగారావు, శ్రీరామ్మూర్తి బిసాయి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: సావిత్రి భాయి పూలే జయంతిని డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వర్శిటీ రెక్టార్ ఆచార్య బి. అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. ఉదయభాస్కర్‌లు మాట్లాడారు. ఎన్నో అటంకాలు ఎదురైనా, బాలికల చదువుకోసం పోరాటాలు చేసి స్ఫూర్తిగా నిలిచిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయిపూలే అని వారు కొనియాడారు. కార్యక్రమంలో వర్శిటీ ఎస్ఒ డా.కె.సామ్రాజ్య లక్ష్మీ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్.రాజశేఖరరావు, అధ్యాపకులు, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే అని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి కొనియాడారు. మండల ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఆదివాసీ పరిషత్ అధ్యక్షులు ఆంపురం సర్పంచ్ డి.జమ్మయ్య, దీనబంధుపురం సర్పంచ్ సవర వెంకటేష్, ముకుందపురం సర్పంచ్ సవర.భాస్కరరావు, గొందర లక్ష్మణరావు, ఎస్.గణేష్, మాజీ సర్పంచ్ సవర వర్మ, గొట్టిపల్లి సర్పంచ్ గొల్ల జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: సావిత్రిపూలేబాయి జయంతి సందర్భంగా మురపాక కెజిబివి పాఠశాల ప్రిన్సిపాల్ బల్ల సుధారాణి ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ కెసి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, శ్రీధర్, రవి, పద్మజ, శాంతి, సునీత, ఇంటరాక్ట్ క్లబ్ జాయింట్ సెక్రటరీ డి. హర్షవర్ధన్ రెడ్డి, ఎస్ పి ఎల్ జ్యోష్న పాల్గొన్నారు.

పాతపట్నం: మండలం కేంద్రంలో సావిత్రిబాయి పూలే సావిత్రిబాయి పూలే జయంతిని ఎంఇఒ కార్యాలయ ఆవరణలో ఎంఇఒ జి.గోవిందరావు అధ్యక్షతన, రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకఅధికారి మంచు కరుణాకరరావు, ఎంపిడిఒ చంద్రకుమారి, ఎంఇఒ సిహెచ్. తిరుమలరావు, పెద్ద లోగిడి హెచ్‌ఎం ఎం.రాజు గోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంచిలి: మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని పాఠశాలల వద్ద నిర్వహించారు. స్థానిక ఎంఆర్‌సి వద్ద ఎవిఒ శివరాం ప్రసాద్, మహిళా ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కంచిలి ఉన్నత పాఠశాల వద్ద మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో బి.కామేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఎంపిడిఒ కె.ఫణింద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు గోవిందరావు, ఎల్వీప్రతాప్‌లతో కలిసి మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పద్మావతి, విపుల, జ్యోతి సౌజన్య, శిరీష, శోభారాణిల సేవలను గుర్తిస్తూ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: పలాస మదర్ థెరీసా పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, మదర్ థెరీసా పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సావిత్రి బాపులే జయంతిని పురస్కరించుకొని మహిళ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరీసా పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ విభాగ అధ్యాపకురాలు ఎ.సునీత, బిఎస్‌సి విద్యార్థిని కుమారి జీవిత, రోజారాణి, ఆర్.ప్రసాదరావు, ఉపాధ్యాయులు జోగారావు, కూర్మారావు, శశిరేఖ, సప్పటి బేబీ, స్రవంతి, యశోద, సావిత్రి, రేవతి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో..

మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ విద్యాధర్ ఆధ్వర్యంలో జ్యోతి సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోంపేట: జాతీయ మహిళా దినోత్సవం, సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకొని స్థానిక జైభీమ్ సేన కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, నగరి మోహనరావు, జిల్లా అధ్యక్షుడు బుస్కా ఈశ్వరరావు, కంచిలి అధ్యక్షులు నూతలపాటి బాబురావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డి.వెంకటరావు, ఎం.పూర్ణచంద్ర, నగరి లీలారాణి, టి.అచ్యుత్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : దేశంలో సాంఘిక దురాచారాలపై ఉద్యమించిన గొప్ప సంఘసంస్కర్త, ప్రథమ ఉపాధ్యాయురాలు సావిత్రిభాయి పూలే అని ఐద్వా నాయకులు కొనియాడారు. నగరంలోని పుణ్యపువీధి కమిటీహాల్ వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, నగర కన్వీనర్ శ్రీదేవి పాణిగ్రహి, ఐద్వా నాయకులు ఆణిపు లత, డోల లక్ష్మి, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

నగరంలో గాంధీ మందిరంలో సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. డాక్టర్ అరవింద్, ఆర్.మహాలక్ష్మీ, ఆర్.అప్పారావు, డాక్టర్ సౌమ్యప్రియ, మందిరకమిటీ ప్రతినిధులు సురంగి మోహనరావు, వావిలపల్లి జగన్నాథం నాయుడు, జామి భీమశంకర్‌లు ఆమె విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో పైడి హరనాథరావు, పొన్నాడ రవికుమార్, నక్క శంకరరావు, కొమ్ము రమణమూర్తి, తర్లాడ అప్పలనాయుడు, అగతముడి

కవిటి : నివాళ్లర్పిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

కోటబొమ్మాళి : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒ

ఇచ్ఛాపురం : నివాళ్లర్పిస్తున్న చైర్మన్ కృష్ణమూర్తి రెడ్డి

పలాస : నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న ఐద్వా నాయకులు

సింహాచలం, అప్పారావు, ఎంవిఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

బిసి గురుకులంలో ...

శ్రీకాకుళంలో గల బిసి గురుకులంలో సావిత్రిభాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా సమత కన్వీనర్ పేడాడ వేదవతి ఆధ్వర్యంలో జరిగిన సమగ్ర శిక్ష ఎపిసి ఎస్.శశి భూషణరావు, ఎఎంఒ సుధాకర్, సిఎంఒ పి.ప్రభాకర్, రిసోర్స్‌పర్సన్స్ వెంకట్రావు, మోహన్ బాబు, సూర్యారావు, శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నౌపడ : నాయకులకు సర్దిచెబుతున్న ఎస్ఐ నారాయణస్వామి

గ్రామసభలో సభ్యుల తోపులాట

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడలో శుక్రవారం జరిగిన గ్రామసభలో సభ్యుల మధ్య జరిగిన స్వల్ప వాగ్వివాదం తోపులాటకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. పంచాయతీ సర్పంచ్ పి.బృందావతి, ఎంపిటిసి-1 ఎల్.దమయంతి సభకు గైర్హాజరు కావడంతో నౌపడ ఉప సర్పంచ్ వాడరేవు రవి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యదర్శి ఉప్పాడ ఉమాపతి గ్రామ అభివృద్ధి, నిధులు కేటాయింపు, ప్రణాళికపై చర్చ పెట్టారు. ఈ సందర్భంగా నౌపడ-2 ఎంపిటిసి బత్సల సుధాకర్, అతనిపై పోటీ చేసిన టిడిపి నాయకులు వాడరేవు కృష్ణారావుకు స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. తొలుత బత్సల సుధాకర్ ఎంపిటిసి సభ్యునిగా ఉన్న తనకు గ్రామంలో అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ప్రజా ప్రతినిధులుగా తమకు గౌరవం ఇవ్వడం లేదని అధికారులను ప్రశ్నించారు.

సచివాలయం వద్ద నాయకుల హైడ్రామా

దానికి బదులుగా టిడిపి నాయకులు కృష్ణారావు గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నాయకులైన తమకు కూడా ప్రాధాన్యత ఇవ్వలేదని, అధికార పార్టీ నాయకుల దగ్గరకు సాధారణంగా ప్రజలు వెళ్తారని దీన్ని రాజకీయం చేయకూడదని చెప్పడంతో వివాదం రాజుకుంది. దీంతో ఎంపిటిసి సభ్యులు సుధాకర్, కృష్ణారావును నెట్టి వేయడంతో చిన్నపాటి తోపులాట చోటు చేసుకుంది. ఈ తోపులాటలో సుధాకర్ చొక్కా చిరిగింది. దీంతో అధికారులు, ప్రజలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న నౌపడ ఎస్ఐ నారాయణస్వామి సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల నాయకులకు సర్ది చెప్పారు. దీనిని ఎలాగైనా రాజకీయంగా వాడుకోవాలని పలువురు వైసిపి నాయకులు హైడ్రామాని నడిపించారు. దీంతో ఉప సర్పంచ్ రవి అంబులెన్స్‌ను పిలిపించి ఎంపిటిసి సభ్యుడు సుధాకర్‌ను 108 వాహనం ద్వారా టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటివరకు వాగ్వివాదం చేసుకున్న నాయకులు గుండె నొప్పి వస్తుందని చెప్పి డ్రామాను రక్తి కట్టించారు. దీనిపై నౌపడ టిడిపి నాయకులు తమపై, ఎంపిటిసి సభ్యుడు దాడి చేశాడని నౌపడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుకోని ఘటనపై పంచాయతీ అధికారులు, గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ హైడ్రామా ఏ రాజకీయ మలుపు తీసుకుంటుందోనని అనుమానిస్తున్నారు. రాజకీయ నాయకులకు గతంలో ఉన్న వ్యక్తిగత కలహాలతో గ్రామ సభలకు వచ్చి వివాదం సృష్టించడం సరికాదని పలువురు అధికారులు, ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు కర్రి విష్ణుమూర్తి, సిహెచ్ బాబ్జి, మహంతి రాజు, కర్రి బాలకృష్ణ, లింగూడు కుమారస్వామి పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండల పరిధిలో కేశవరావుపేటలో సర్పంచ్ పైడి భాస్కరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను డిమాండ్, పన్నుల బకాయిల వివరాలు, ఉపాధి హామీ పనులపై చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.సతీష్ కుమార్, ఎంపిటిసి సూర జగదీశ్వరరావు, మాజీ సర్పంచ్ పొందూరు భీమారం, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలి

ఎచ్చెర్ల: స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్ల మండలం ధర్మవరంలో 'మేముసైతం - స్వచ్ఛంద సేవా సంస్థ' ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో అండర్-19 మండలస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు టేకి ఆచారి తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు తమ యొక్క వివరాలను వ్యక్తిగతంగా, ఫోన్ ద్వారాగాని నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో విజేతలకు ప్రథమ రూ.8వేలు, ద్వితీయ రూ.5వేలు, తృతీయ రూ.3వేలు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. అలాగే క్రీడాకారులు 2004 తరువాత జన్మించినవారై ఉండాలని, వయోనిర్ధారణ కోసం జనన ధృవీకరణ పత్రం గాని, ఆధార్ కార్డు గాని తీసుకురావాలని, ఒక జట్టులోని క్రీడాకారులు అదే పంచాయతీకి చెందినవారై ఉండాలన్నారు. ప్రతీ జట్టు రూ.300 ఎంట్రీ ఫీజును 10వ తేదీ 12 గంటల్లోగా చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9182254531, 8143299133 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

లక్ష్యం వైపు దూసుకుపోవాలి

వజ్రపుకొత్తూరు : విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలు వైపు దూసుకుపోవాలని ప్రధానోపాధ్యాయులు కె. హరిబాబు అన్నారు. శుక్రవారం గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్స్, బుక్స్ పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలలో 41 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే రూపొందించిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు బాగా ఉపయోగపడతాయని, పుస్తకాలదాత, విశ్రాంతి ఉపాధ్యాయులు చాప కారువాడు అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని పలువురు ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు కంచరాన జయరాం, కలిశెట్టి సింహాచలం, గొరకల శరత్, పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మణరావు, చింత ఉమారావు, సీతమ్మ, సత్యరాజు, ఉమామహేశ్వరి, రాజశేఖర్, రషీద్, ధర్మారావు, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

సిసి రోడ్డును నిర్మిస్తాం

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నర్సిపురం కాలనీలో రూ. 70 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేసి ఈ ప్రాంత ప్రజలకు అంకితం చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నర్సిపురం కాలనీ, 12 వార్డు పరిధిలో చాకల చెరువు సమీపంలో ఉన్న దోబి ఘాట్, పవర్ బోర్‌ను శుక్రవారం మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాకల చెరువు సమీపంలో ఉన్న దోబి ఘాట్‌కు రక్షణగోడ, సామాజిక భవనం నిర్మాణం చేపడతామని హామీఇచ్చారు. అందుకు మున్సిపల్ అధికారులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పవర్‌బోర్ మరమ్మతులు చేపట్టి తాగునీరు అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఆమెతో పాటు మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, రాంబాబు, రోణంకి వెంకటరమణ, కొవ్వూరు సురేష్ కుమార్, టంకాల రవిశంకర్ గుప్తా, మున్సిపల్ డిఇఇ కనకరాజు, ఎఇ కిరణ్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

భారతదేశం గర్వించే స్థాయికి జిల్లాకి చెందిన క్రీడాకారులు ఎదగాలని, క్రీడల్లో విజేతలుగా రాణించిన క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్, దేశం గర్వించే స్థాయికి క్రీడాకారులు ఎదగాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం మండలం మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రిగ్స్ ఆటల పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాజ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు, క్రీడాకారులు లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమ శిక్షణతో రాణించాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి మండల వంశధార సాగునీటి డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్‌లు ఎం.వెంకట అప్పలనాయుడు, ఎస్.చంద్రశేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోలాకి : క్రీడాజ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కవిటి : ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రాజారావు, ప్రకాష్

ముగిసిన గ్రిగ్స్ పోటీలు

కవిటి: కవిటి క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న గ్రిగ్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో వాలీబాల్ సీనియర్ విభాగంలో జి.హెచ్.ఎస్ బారువ ప్రథమ స్థానంలో నిలవగా, జెడ్‌పిహెచ్‌ఎస్ పిఎస్‌ఆర్ పురం ద్వితీయ స్థానం సాధించింది. బ్యాడ్మింటన్ జూనియర్, సీనియర్ విభాగాల్లో జి.హెచ్.ఎస్ కవిటి ప్రథమ స్థానం సాధించగా ఎపిఎంఎస్ ఎంఎస్ పల్లి ద్వితీయ స్థానం సాధించాయి. అదే విధంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్ విభాగాల్లో విజేతలకు ఎమ్మెల్సీ రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి. మల్లేశ్వరరావు, ఎంపిటిసి పూడి నీలాచలం, కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, ఎం. కృష్ణారావు, దుద్ది ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో బాలునికి అస్వస్థత

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

చికిత్స పొందుతున్న సాయి

మండలం పాత నౌపడలో ఖాన్ సాయి అనే 12 ఏళ్ల బాలుడు పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. శుక్రవారం పొలంలో నడుస్తుండగా విషసర్పం కాటు వేసింది. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనానికి సమాచారం అందజేయడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సాయికి చికిత్స చేశారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

అదుపు తప్పిన లగేజ్ వ్యాను

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని బూర్జమాను గూడ నుంచి అప్పలపేట గ్రామానికి కూలి పనుల కోసం లగేజ్ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న పలువురు కూలీలతో గోపిదేవిపేట వద్ద వ్యాను అదుపు తప్పి రోడ్డుపై పడటంతో డ్రైవర్‌తో పాటు నలుగురికి తీవ్రంగా గాయాలయ్యాయని ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు. అనంతరం పాలకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు.


స్వాధీనం చేసుకున్న సామగ్రి

బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో శుక్రవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి తిరుపతి నాయుడు ఆదేశాల మేరకు మండలంలో ఎగువ బగడలో టెక్కలి, పాతపట్నం ఎక్సైజ్ సిబ్బంది నాటుసారా ఊటలపై విస్తృత దాడులు చేసి 900 లీటర్ల పులిసిన బెల్లం ఊటను, 9 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేసినట్లు టెక్కలి ఎక్సైజ్ సిఐ మీరా సాహెబ్ తెలిపారు. ఎక్కడైనా నాటుసారా తయారీ చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందివ్వాలని తెలిపారు. నాటుసారా తయారీదారులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో మెళియాపుట్టి ఎస్ఐ పి.రమేష్ బాబు, పాతపట్నం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

డీలరుపై 6ఎ కేసు నమోదు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని శ్రీరాంపురం రేషన్ డిపోలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సిఐ బి.రామారావు ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ అధికారులు సోదాలు నిర్వహించారు. రికార్డులకు మించి 179 కిలోల బియ్యం, మూడు కిలోల పంచదార అదనంగా ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత డీలర్ రాంబాబుపై 6ఎ కేసు నమోదు చేసి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తున్నట్లు సిఐ తెలిపారు.

రేషన్ డిపోలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

నూతన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

'ఐతమ్'లో నూతన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలిరూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఐటిఐ విభాగంలో హెచ్ఒడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వి.ఆశోక్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష్ కుమార్ పాణిగ్రాహి, డాక్టర్ హరిహర సంతోష్ నూతనంగా రచించిన 'ఎ డబ్ల్యూఎస్ ఫర్ క్లౌడ్ కంప్యూటింగ్' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక ఆవశ్యకతను వివరిస్తూ బిసిఎ, ఐటిఐ, సిఎస్ఇ కోర్సుల్లో క్లౌడ్ కంప్యూటింగ్ కోసం తెలుసు కోవాలనుకున్న వారందరికీ చాలా ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థులకు, సమాజానికి ఉపయోగపడే మరిన్ని పుస్తకాలను రచించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పుస్తకావిష్కరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ .శ్రీనివాసరావు, రచయితలు పాల్గొనగా డీన్ ఆర్‌ఎండి డాక్టర్ డి.శ్రీరాములు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఘనంగా జ్ఞానభారతి వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 41వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పాఠశాల సెక్రటరీ, కార్యదర్శి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిన్నం నాయుడు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొని పాఠశాల పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘమైన విద్యా సేవలు అందిస్తున్న జ్ఞాన భారతి పాఠశాలను అభినందించారు. ఆదర్శవంతమైన పాఠశాలకు కావాల్సిన అన్ని సదుపాయాలు, సౌకర్యాలతో కూడిన వాతావరణం జ్ఞాన భారతిలో ఉండటంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల కార్యదర్శి సిఇఒ జోహార్ ఖాన్ మాట్లాడుతూ 40 ఏళ్ల పాఠశాల విజయ ప్రస్థానాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐందు భూషణ్ పండా, పాఠశాల హెచ్ఎం రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని జనసేన పార్టీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు విజ్ఞప్తి చేశారు. మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్‌తో సమావేశమై సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19 ప్రభుత్వంలో ఆరంభించి మధ్యలో నిలిపివేసిన పూడిలంక వంతెన రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. జలజీవన్ మిషన్ ద్వారా ఉద్దానం కిడ్నీ బాధిత గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. రక్షిత మంచినీటి పథకం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. పలాసకు గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక కార్యాలయం తరలించాలని కోరారు. 200 పడకల కిడ్నీ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నెల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయుష్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని దుర్గారావు కోరారు. ఆయనతో పాటు జిల్లా జనసేన కార్యదర్శి హరీష్ కుమార్ శ్రీకాంత్ , జనసేన నాయకులు కోన ప్రసాద్‌రావు, దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, పుక్కళ ఉమా శంకర్, బమ్మిడి విద్యాసాగర్, అర్జీ తులసీరావు, కీలు సునీల్ వర్మ, మాణిక్య వర్మ ఉన్నారు.

హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నిహార్

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ కలుగుతుందని ఎస్ఐ బి.నిహార్ అన్నారు. శుక్రవారం బైపల్లి బస్టాండ్ వద్ద వాహనచోదకులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం వలన విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించకపోవడం వలన చాలామంది ప్రాణాలు కోల్పోయి కుటుంబాలకు శోకాన్ని మిగులిస్తున్నారని అన్నారు. పోలీసులు కోసం కాకుండా తమ కుటుంబాల కోసం తమ కోసం తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ ఉపయోగాలను తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలో పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ముందుగా కరగాం పంచాయతీలో చిన్న కరగాము నుంచి నరసింగపల్లి వరకు రూ.90 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే మబగాం దేవాది రోడ్డు నుంచి కిల్లాం గ్రామానికి రూ.కోటితో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. అదేవిదంగా రావుల వలస నుంచి ఈదులవలస వరకు రూ.కోటి 30 లక్షలతో రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అదికారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో మోడల్ స్కూల్‌కు ప్రథమ స్థానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించిన పురుషోత్తపురం ఆదర్శ పాఠశాల విద్యార్థి పాండవ దీపక్ కుమార్‌కు పలువురు అభినందించారు. మండల స్థాయిలో ఎంపిక కాబడిన వైజ్ఞానిక ప్రదర్శనలకు శుక్రవారం జిల్లాస్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు శ్రీకాకుళం పరిధిలోని వివిధ మండలాల నుంచి ఎంపిక కాబడిన వైజ్ఞానిక ప్రదర్శనలు వివిధ పాఠశాలల విద్యార్థులచే ప్రదర్శింపబడ్డాయి. ఇచ్ఛాపురం మండలం ఆదర్శ పాఠశాల విద్యార్థి పాండవ దీపక్ కుమార్ చేసిన లిక్విడ్ ట్రీ (లిక్విడ్ ట్రీ) వైజ్ఞానిక ప్రదర్శన జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. విద్యార్థి విజయం సాధించడంతో విద్యార్థి దీపక్ కుమార్, ప్రిన్సిపాల్ దుంపల వైకుంఠరావు, సైన్స్ సిబ్బందిని మండల విద్యాశాఖ అధికారి కూర్మాన అప్పారావు అభినందించారు.

రీ సర్వేపై అవగాహనా ర్యాలీ

నందిగాం : ర్యాలీ నిర్వహిస్తున్న తహశీల్దార్, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- నందిగాం

ప్రభుత్వం నిర్వహించనున్న రీసర్వేపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మండలం నౌగాంలో తహశీల్దార్ పి.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పైలట్ విలేజ్ మామిడిపల్లి రెవెన్యూ గ్రామానికి సంబంధించిన రైతులు, గ్రామపెద్దలతో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నౌగాం సర్పంచ్ పుష్ప సత్యం, మండల సర్వేయర్ హనుమంతరావు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లావేరు: భూసమస్యలు పరిష్కరమే లక్ష్యమని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. బుడతావలస, నీలాపురంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. బుడతావలసలో 15, నీలాపురంలో 5 వినతిపత్రాలు వచ్చినట్లు తెలిపారు. ఈ సదస్సులో మండల సర్వేయర్ బి. శ్రీధర్ రెడ్డి, డిటి ఎం.తిరుపతిరావు, ఎంపిటిసి ముళ్లసాయికుమార్, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

సోంపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమం విజయవంతం చేయాలని తహశీల్దార్ బి.అప్పలస్వామి కోరారు. మండలంలోని మూలపొలంలో రీ సర్వే అవగాహన ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఢిల్లీరావు, సిబ్బంది శ్యామసుందరరావు, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

లావేరు : మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు

కొత్తగా 9 రేషన్ దుకాణాలు

ప్రజాశక్తి- లావేరు

మండలానికి నూతనంగా తొమ్మిది రేషన్ దుకాణాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తహశీల్దార్ ఎన్ని జోగారావు శుక్రవారం తెలిపారు. మురపాక, చిన్నయ్య పేట, గుంటుకు పేట, రాయవలస, పాతరౌతుపేట, నక్కపేట, రామునిపాళెం, నెదురుపేట, చాపురం గ్రామాలకు రేషన్ దుకాణాలు నూతనంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీలర్లు నియమకం జరగనుందని చెప్పారు.

పరుగు పందెంలో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- బూర్జ

కావ్య

మండలంలోని కేకే రాజపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని పరుగుపందెంలో తన ప్రతిభను చాటింది. హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని కొట్టి కావ్య జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ 2 కిలోమీటర్లు పరుగు పందెంలో బిజీ స్థానంలో నిలిచింది. ఈనెల 5న పశ్చిమగోదావరి జిల్లా తంబాకు గ్రామంలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పరుగు పందెం పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వై.మాలతి, పిఇటి ఇ.అప్పన్న తెలిపారు. పరుగు పందెంలో ప్రతిభ చాటిన కావ్యను గ్రామ సర్పంచ్ కోరికాన రాజగోపాలరావు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామపెద్దలు అభినందించారు.

కేలండర్‌ను విడుదల చేస్తున్న డిఇఒ

తెలుగునాడు కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా కేలండర్‌ను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య ఆవిష్కరించారు. నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్రోతు జగన్నాధరావు, ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి చంద్రశేఖరరావు, సంఘబాధ్యులు జి.కృష్ణారావు, కెంబూరి శ్రీనివాసరావు, పి.గోవిందరావు, కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు

పలాస: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా పేకాట, గుండాట, కోడిపందాలు లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎస్‌పి వి.వెంకట అప్పారావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండగ సందర్భంగా ఎవరైనా తన స్వగ్రామం వెళ్లిన యెడల వారు విలువైన బంగారు ఆభరణాలు లాకర్‌లోగాని తమ వెంటగానీ తీసుకుని వెళ్లాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలు ఎవరైనా అమ్మిన సేవించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు ఎక్కడైనా జరిగితే 6309990825, 6309990805 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కేలండర్ ఆవిష్కరణ

పాతపట్నం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం కేలండర్, డైరీలను ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జాతీయ భావజాలంతో పనిచేసే ఒక గొప్ప సంఘంగా అభివర్ణించారు. ఉపాధ్యాయులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంఘసభ్యులు ఆయనను దుశ్శాలువతో సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయులు పాడి, రాష్ట్ర కార్యదర్శి దువ్వారి చలపతిరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిరిపురం సోమేశ్వరరావు, హరి బిస్వాల్, ఆపస్ సభ్యులు శ్యాంబాబు, మోహనరావు, శ్రీనివాస్, బలరాం, రామారావు, రమేష్ పాల్గొన్నారు.

సబ్సిడీపై అపరాల విత్తనాలు

బూర్జ: సబ్సిడీపై అపరాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. అల్లెన, పాలవలస, పెద్దపేట, ఎపిపేట, ఒవిపేట, గుత్తావల్లి గ్రామ సచివాలయాల వద్ద 12 క్వింటాల నువ్వుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు సబ్సిడీపై రూ.102కే కేజీ నువ్వుల విత్తనాలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే అప్పలపేట, కొల్లివలస, తోటవాడ గ్రామ సచివాలయాల్లో వేరుశనగ విత్తనాలు 25 క్వింటాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి ధర కేజీ రూ.38కే సబ్సిడీపై అందించనున్నామన్నారు. 30 కేజీల వేరుశనగ విత్తనాలు బస్తా రూ.1728కు ఇవ్వనున్నామన్నారు. అలాగే అన్ని గ్రామ సచివాలయాల్లో మినప విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మండల రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీలర్ల నియామకాలకు నోటిఫికేషన్ విడుదల

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 107 పౌరసరఫరాల డీలరు పోస్టులను భర్తీ చేస్తున్నట్టు శ్రీకాకుళం ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఆమె తెలిపారు. దరఖాస్తుదారులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులై ఉండాలని ఆమె సూచించారు. ఈనెల 23 సాయంత్రం 5 గంటలలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 80 మార్కుల రాత పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి వచ్చేనెల 9న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కంచిలి : మండలంలోని పలు రెవెన్యూ గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియామకాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ అయినట్లు తహశీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. జనవరి 21లోగా సంబంధిత దరఖాస్తులను పలాస ఆర్‌డిఒ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు. నియామకాలకు సంబంధించి ఫిబ్రవరి 5న రాత పరీక్ష, 15వ తేదీన మౌఖిక పరీక్ష ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

లావేరు: మండలంలోని 14 రేషన్ దుకాణాలకు కొత్తగా డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ జరిచేసినట్లు తహశీల్దార్ ఎన్ని జోగారావు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ పాసై, 18 ఏళ్ల పైబడి 40 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఈనెల 23న సాయంత్రం 5 గంటలు లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఫిబ్రవరి 5న శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ పురుషులు కాలేజీలో రాతపరీక్షకు హాజరుకావాలన్నారు.

వాణీ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని గాజుల కొల్లివలస వద్ద నున్న శ్రీ వాణీ విద్యా నికేతన్‌లో సంక్రాంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. భోగి మంటలు, రంగవల్లుల పోటీలు, గంగిరెద్దుల వేషధారణ, హరిదాసు కీర్తనలు, గాలి పటాల తయారీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. తెలుగు వారి సాంప్రదాయాలు, ఆచారాలు ప్రస్ఫుటించేటట్లు వేడుకలను అత్యంత వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంక్రాంతి వైభవంపై చిన్నారులు వేసిన నాటిక పలువురిని అలరించింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బలివాడ వేంకటేశ్వర్లు, కరస్పాండెంట్ బలివాడ నారాయణమూర్తి, హెచ్ఎం బలివాడ సంపత్ కుమార్, ఉపాధ్యాయులు యస్.వి. రమణమూర్తి, కె.వి.రాజారావు, హరిబాబు, అప్పలనాయుడు, శ్రీరామ్, ప్రణవి, తరుణ్, భవాని, ఇందుమతి, వెంకట లక్ష్మి, షర్మిళ, ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

భోగి మంటలు వేసిన విద్యార్థులు

భద్రతా ప్రమాణాలతో ప్రమాదాల నివారణ

ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- రణస్థలం

పరిశ్రమల్లో విధులు నిర్వహించినప్పుడు భద్రత ప్రమాణాలు, అవగాహన పెంపొందించుకుని బాధ్యతగా పాటించాలని తద్వారా ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు అన్నారు. శుక్రవారం పైడిభీమవరం ఎపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ - 4లో మిథనాల్ సాల్వెంట్ పైపులైను నుంచి లీక్ అయినట్లు ఆన్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ ఆన్‌సైట్ మాక్ డ్రిల్‌లో జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, ఎన్‌డిఆర్‌ఎఫ్ టీం, జిల్లా అగ్నిమాపక టీం, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమంలో ఉన్న కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఈ మాక్ డ్రిల్ పురోగతి కొరకు కొన్ని సూచనలు, సలహాలను అందించారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా భద్రతను పాటిస్తే ప్రమాదాల నివారణతో పాటు ప్రమాదాల నష్టాలను కూడా నివారించవచ్చని అందుకు పరిశ్రమలో ఉన్న కార్మికులు, ఉద్యోగులు ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఎపిటోరియా యాజమాన్యం సిబ్బంది ఎంతో అవగాహనతో చైతన్యంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ మదన్ కుమార్ తో పాటు భద్రతా అధికారి సంపత్ రెడ్డి, హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్ అధికారి కమలాకర్ రెడ్డి, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రాంతంలో జీడి పరిశ్రమలు ఉన్నాయని, వాటిపై వేల సంఖ్యలో కార్మికులు జీవనం సాగిస్తున్నారని, అటువంటి జీడి పరిశ్రమలను అభివృద్ధి చేయడంతో పాటు వాటికి అనుగుణంగా నూతన పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజ్‌ను ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు కోరారు. అమరావతి ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయంలో యువరాజ్‌ను కలిశారు. రానున్న కాలంలో మరిన్ని పరిశ్రమలు కూడా రానున్నయని ఇటువంటి పరిశ్రమలు, ఆ పరిశ్రమల ద్వార జరుగుతున్నటువంటి ఇంపోర్ట్, ఎక్స్పోర్ట్‌ను ఆయన యువరాజుతో కొద్దిసేపు చర్చించారు. అదేవిధంగా పరిశ్రమలు అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. పరిశ్రమలు మరింతగా అభివృద్ధి చెందేందుకు తమవంతు సహకారం అందించాలని కోరారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాబూరావు

మహోన్నత వ్యక్తి మన్మోహన్ సింగ్

నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ కాంగ్రెస్ వాదిగానే కాక ఆర్థికశాస్త్ర వేత్తగా విలువలున్న రాజకీయ నాయకుడిగా ప్రజల మన్ననలను అందుకున్న మహోన్నత వ్యక్తి అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి గాదం త్రినాధరావు అన్నారు. శుక్రవారం ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మన్మోహన్ సింగ్ సంతాప సభ డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశ ఆర్థిక విధానంలో సమూల మార్పును, సంస్కరణలను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కెవిఎల్ఎస్ ఈశ్వరి, రాష్ట్ర ఎస్‌సి విభాగం ప్రధాన కార్యదర్శి తెంబూరు మధుసూదనరావు, పార్టీ నాయకులు బొచ్చ వెంకటరమణ, సత్యనారాయణ, ఆబోతుల వెంకటనాయుడు, కూరాకుల వెంకటరావు, అంబటి దాలినాయుడు, ఇజ్జురోతు రమణ, గొల్లపల్లి దాలయ్య, గుంటబారిక అప్పారావు పాల్గొన్నారు.

దుక్కి లేకుండా మొక్కజొన్న సాగు

జి.సిగడాం: మొక్కజొన్న సాగు చేయటంలో కూలీల కొరత అధికంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వరి కోతల అనంతరం వరి మాగాణిల్లో దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగు చేయటం వలన సుమారు 3 తడుల నీరు ఆదా అవడంతో పాటు, పెట్టుబడి ఖర్చు ఆదా చేయవచ్చునని ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. శుక్రవారం మండలంలో మెట్టవలసలో రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా మొక్కజొన్న సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిపంట కోసిన అనంతరం ఉన్న తేమలో (నల్లపదును) మార్కర్ యంత్రాలతో వరుసలలో రంధ్రాలు చేసి మొక్కజొన్న విత్తనాలను నేరుగా నాటడం వలన అప్పటికే నేలలో ఉన్న కొన్ని పోషకాలు అంది పంట ఏపుగా పెరుగుతుందన్నారు. సాధారణ పద్ధతిలో రైతులు సుమారు మూడుసార్లు దుక్కి చేసి, ఆఖరి దుక్కు ఎడ్ల నాగలితో చేస్తూ మహిళా కూలీలతో విత్తనాలు నాటడం జరుగుతుందన్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో కూడిన యంత్రాలను అందుబాటులోకి వచ్చాయన్నారు. డబుల్ వీల్ మార్కర్ పరికరం రైతులకు ప్రతి గ్రామంలో అందుబాటు ఉంటాయని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త డి.సూర్యనారాయణ అన్నారు. రైతు పి.సింహాద్రినాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న సూర్యనారాయణ

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాల సహాయకుల (ఆయా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ పార్వతి పేర్కొన్నారు. మండలంలోని సిరిపురం, పెద్దపలియా, కొటారింగితాళ భద్ర గ్రామాల అంగన్వాడీ కేంద్రాల సహాయకుల పోస్టులకు ఈ నెల 10లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లోని ఎస్‌టి అభ్యర్థులు మాత్రమే తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

సైన్స్ ఫెస్ట్‌లో విద్యార్థికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి- పలాస

సదరన్ ఇండియా సైన్స్‌ఫెస్ట్ 2024 -2025 విద్యా సంవత్సరానికి జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించబడిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జస్వంత్ పాత్రో, విద్యార్థి జస్వంత్ పాత్రో, గైడ్ టీచర్ జినగ షణ్ముఖరావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన రీజనరేటివ్ బ్రేకింగ్ సిస్టం ప్రాజెక్టుకు వ్యక్తిగత విభాగంలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం లభించింది. విజేతకు సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖ అధికారులు విజయ కుమారి, విలియమ్స్ చేతులమీదుగా బహుమతి ప్రధానం చేశారు. జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థి, గైడ్ టీచర్‌కు పాఠశాల హెచ్ఎం డి.దాశరధి, పాఠశాల యాజమాన్య కమిటీ తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

సంక్షేమ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ వెల్ఫేర్ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర సంచాలకులు బి. నీలవేణికి వినతిపత్రం అందించినట్లు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం తాడేపల్లిలోని ఆమె కార్యాలయంలో కలిశారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సంక్షేమ, విద్యా సహాయకులు, వెల్ఫేర్ సెక్రెటరీల ప్రధాన సమస్యలైన ప్రమోషన్ ఛానల్ సర్వీస్ రూల్స్‌లో మార్పులు, పెన్షన్ల పంపిణీలో కొన్ని జిల్లాల్లో ఉద్యోగులకు చిన్న చిన్న కారణాలతో షోకాజు నోటీసులు సస్పెన్షన్ల పరిష్కారం కోసం ఆమె దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సమస్యలపై ఆమె స్పందించినట్టు తెలిపారు. ఈయనతో సంఘం అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర కార్యదర్శి వి. లక్ష్మీ నారాయణ, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐలుగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బి. హైమావతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ బి. నిహార్ మూడు నెలల కిందట వజ్రపు కొత్తూరు ఎస్ఐగా బదిలీపై వెళ్లినప్పటి నుంచి సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట మండలాల పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా ఎవరిని నియమించకపోవడంతో టి.రాజేష్, ఎస్.బాలరాజులు ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఎస్ఐలుగా వ్యవహరించారు. ఎట్టకేలకు సరుబుజ్జిలి ఎస్ఐగా హైమావతిను జిల్లా అధికారులు నియమించారు.

ఆమదాలవలస: నూతన ఎస్ఐగా సనపల బాలరాజు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన కె.వెంకటేష్ బదిలీపై విఆర్‌కు ఉన్నతాధికారులు పంపారు. సరుబుజ్జిలి ఇన్‌ఛార్జి ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన సనపల బాలరాజు బదిలీపై ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.

జానపదాన్ని ఆలపిస్తున్న దిలీప్

జానపద పోటీలకు యువకుడు ఎంపిక

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ సెట్‌శ్రీ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి జానపద పోటీల్లో పలాస మండలం బొడ్డపాడుకు చెందిన మద్దిల దిలీప్ (చిట్టి మాస్టర్) ప్రథమ స్థానం కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ఎంపికై విజయవాడలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రేలారే రేలా జానికిరాం పాడిన జానపదం చక్కగా చేసి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. దీంతో స్వగ్రామం బొడ్డపాడుకు చెందిన మద్దిల దిలీప్‌కు తల్లిదండ్రులు, గ్రామ యువకులు, పెద్దలు అభినందనలు తెలిపారు.

ఎత్తిపోతల పథకానికి భూమి పూజ

కోటబొమ్మాళి: మండలం నిమ్మాడ ఎత్తిపోతల పథకం పున:నిర్మాణానికి మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ శుక్రవారం భూమి పూజ చేసి పనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 60 ఎకరాల ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుందని, పాత పైపులు పాడైపోయి శిథిలావస్థకు చేరుకుని శివారు ఆయకట్టుకు నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడడంతో మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తన సొంత నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమములో కింజరాపు కృష్ణ, కాంట్రాక్టర్ చల్ల సింహాచలం, శిమ్మ వెంకటరావు, డిఇఇ మనిగాము కామరాజు, ఎఇ జి.మధుసూధనరావు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి- కవిటి

ఆపన్నులకు అండగా ఉండేందుకు శ్రీ బానమ్మ, రాములయ్య ట్రస్ట్ ఏర్పాటు చేసినట్టు విశ్రాంత డిఎస్‌పి, జనసేన నాయకుడు ఎస్‌విివి ప్రసాదరావు అన్నారు. మండలం బట్టివానిపాలెంకు చెందిన బావన కావేరి కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. దీంతో విషయం తెలుసుకున్న ప్రసాదరావు శుక్రవారం గ్రామానికి చేరుకుని వారితో మాట్లాడారు. తక్షణసాయంగా వారికి నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కావేరికి దాతలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎం. సీతాలు, పాపయ్య రెడ్డి, పి.వెంకటరావు, తిరుపతి బెహరా, దాలి బందు, కృష్ణ, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-బి కాలనీలో అన్నవితరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని విశాఖ బి.కాలనీలో శిర్డీసాయి మందిర కమిటీ, నారాయణ సేవాసమితి సహకారంతో శుక్రవారం నగరంలోని నిస్సహాయులకు అన్నవితరణ చేపట్టారు. నగరంలో ముఖ్య కూడలితో పాటు నైట్‌షెల్టర్, రామలక్ష్మణ కూడలి, సూర్యమహల్, డే అండ్ నైట్, కొత్తరోడ్డు, ఎన్‌జిఒ హోం, పాత బస్‌స్టాండ్, అరసవల్లిలో గల నిరుపేదలకు అన్నవితరణ చేపట్టారు. కార్యక్రమంలో కొంక్యాన శివ శంకర్, బొచ్చ జగదీష్, శివతేజ తదితరులు పాల్గొన్నారు.